

ఎన్నికల్లో ఓడితే పార్టీ పదవి గల్లంతే !

● డీఎంకే నాయకులకు స్టాలిన్ హెచ్చరిక



తిరునల్వేలి పార్టీ ఇన్‌ఛార్జితో మాట్లాడుతున్న స్టాలిన్

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను పార్టీ పదవి నుంచి తొలగించనున్నట్లు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, నియోజకవర్గాల వారీగా 'ఉడన్ పిరప్పేవా' పేరిట 234 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జులతో తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో స్టాలిన్ చర్చలు జరుపుతున్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు, డీఎంకే ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, ఇప్పటివరకు పూర్తి చేసిన అభివృద్ధి పథకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్నికలకు ఎలా సిద్ధపడాలి, ప్రజలను మెప్పించేలా ప్రచారం ఎలా ఉండాలి, బహిరంగ సభలు, బూత్ కమిటీల పనితీరు తదితర అంశాలపై పార్టీ నేతలకు స్టాలిన్ దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇప్పటివరకు 33 రోజుల్లో 73 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను వన్ టూ వన్ కార్యక్రమానికి ఆహ్వానించి వారికి స్టాలిన్ సూచనలిచ్చారు. గురువారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో శంకరన్‌కోవిల్, తిరునల్వేలి నియోజకవర్గాల నాయకులు, ఎన్నికల ఇన్‌ఛార్జి ఎంపీ కనిమొళి తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్ వారితో మాట్లాడుతూ, తిరునల్వేలి నియోజకవర్గంలో పార్టీని గెలిపించకుంటే పార్టీ పదవులు కోల్పోతారని హెచ్చరించారు. కొత్తగా చేపట్టిన సర్ ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాలని, పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను జాబితా నుండి తొలగించకుండా ఉండేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్‌షోలకు విధి విధానాలు

● జనం 50 వేల మంది దాటితే రూ.20లక్షల డిపాజిట్ ● అఖిలపక్ష సమావేశంలో ప్రతిపాదన




అఖిలపక్ష సమావేశంలో సీఎస్ ఎన్.మురుగానందం, మంత్రులు నెహ్రూ, సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జ్ డీజీపీ వెంకట్రామన్

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్‌షోలు నిర్వహించే పార్టీల నుంచి ముందస్తు డిపాజిట్లు వసూలు చేయాలని గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశం సూచించింది. సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట జరిగిన 41 మంది మృతి చెందటంతో రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నూతన విధివిధానాలను రూపొందించాలని నిర్ణయించింది. సుప్రీం కోర్టు కూడా వీలైనంత త్వరగా విధివిధానాలను రూపొందించి ఓ సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం అధ్యక్షతన సచివాలయం సమీపంలోని నామక్కల్ కవింజరెలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వం తరఫున మంత్రులు కేఎన్ నెహ్రూ, రఘుపతి, ఎం.సుబ్రమణ్యం, ఇంఛార్జి డీజీపీ వెంకట్రామన్ పాల్గొన్నారు. డీఎంకే తరఫున ఆర్ఎస్ భారతి, ఎన్.ఆర్ ఇలంగో, అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి డి.జయకుమార్, ఎంపీ ఇన్బదురై హాజరయ్యారు. కాంగ్రెస్ తరఫున సెల్వపెరుంతగై, తమిళగవాళ్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా, డీపీఐ ఎమ్మెల్యే ఎస్ఎస్ భవానీ తదితరులు పాల్గొన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రచార సభలు, రోడ్‌షోలో, పాదయాత్రలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలకూ ఒకే రకమైన విధివిధానాలు అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు మంత్రులు ఈ సందర్భంగా కొన్ని ప్రతిపాదనలను అఖిలపక్ష ం దృష్టికి తీసుకువచ్చారు. ఆ మేరకు రాజకీయ పార్టీల నుండి ముందుగా డిపాజిట్ వసూలు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. 5 వేల నుండి 10 వేల మంది హాజరయ్యే సభలు, ర్యాలీలకు రూ.లక్ష, 10 వేల నుండి 20 వేల వరకు హాజరైతే రూ.3లక్షలు, 20 వేల నుంచి 50 వేలలోపు జనం హాజరయితే రూ.8లక్షలు, 50 వేలు అంతకంటే ఎక్కువగా జనాలు హాజరయితే రూ.20లక్షలు ముందస్తు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఇదే విధంగా రోడ్‌షోలు జరిగే ప్రాంతాల వద్ద రెండు గంటలకు ముందే ప్రజలు గుమికూడకుండా ఆంక్షలు విధించాలని, రోడ్‌షోలు, బహిరంగ సభలను 3 గంటల్లోగా పూర్తిచేయాలని, హాజరయ్యే జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సభలు, రోడ్‌షో ముగిసిన తర్వాత జనం సాఫీగా స్వస్థలాలకు చేరుకునేలా నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సభలు, రోడ్‌షోలు జరిపేవారు రాతపూర్వకంగా ప్రకటించిన జనం కంటే 50 శాతం అధికంగా హాజరైతే పార్టీ నాయకులు చెల్లించిన డిపాజిట్ తిరిగి చెల్లించే ప్రసక్తి లేకుండా కొత్త నిబంధన అమలు చేయాలని పార్టీల ప్రతినిధులు కొందరు ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నుండి సేకరించిన అభిప్రాయాలను, రాతపూర్వకంగా ఇచ్చిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి కొత్త విధివిధానాలను రూపొందించి న్యాయస్థానంలో సమర్పించనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం తెలిపారు.

అనుమతి మంజూరులో పక్షపాతం వద్దు: అన్నాడీఎంకే

రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు సభలు, ర్యాలీలు, రోడ్‌షోలకు పోలీసులు పాలకపక్షానికి సానుకూలంగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా అనుమతులివ్వకూడదని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ సూచించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమకు సభలు, ర్యాలీలు, రోడ్‌షోలకు పోలీసులు ఎప్పుడూ సకాలంలో అనుమతులివ్వలేదని, ప్రస్తుతం సుప్రీం కోర్టు ఉత్తర్వు మేరకు రూపొందించనున్న విధివిధానాలు పక్షపాతరహితంగా అందరికి సమానంగా అనుమతిచ్చేలా ఉండాలని ఆయన సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జయకుమార్

'సమతా ఇష్టి'కి అంకురార్పణ

● చిన్నజీయరు స్వామి పర్యవేక్షణలో 13 వరకు పలు కార్యక్రమాలు

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమత్వ, శాంతి, సౌఖ్యాభివృద్ధికై సాప్తాహ్నిక పంచకుండాత్మక 'సమతా ఇష్టి' ప్రత్యేక ఆధ్మాతిక కార్యక్రమం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి చేతుల మీదుగా అంకురార్పణంతో గురువారం సాయంత్రం ప్రారంభమైంది.



అంకురార్పణ కార్యక్రమంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి

పెరంబూర్‌లోని ఎస్పీఆర్ సిటీలో ఈ నెల 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటలకు సుదర్శన నృసింహ ఇష్టి, వైనతేయ ఇష్టి, హయగ్రీవ ఇష్టి, పరమేష్టి (ధన్వంతరి హోమం) విష్వక్సేన ఇష్టి, లక్ష్మీనారాయణ ఇష్టి, చివరి రోజు శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తారు. వీటితో పాటు గోపూజా, లక్ష్మీపూజ, వేంకటేశ్వర పూజ, తీర్థగోష్ఠి, పూర్ణాహుతి, విష్ణుసహస్రనామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్మాతిక ప్రవచనం, తిరుమంజనం, నామసంకీర్తనం, రామానుజ నూత్రాండి సామూహిక పారాయణం, ఆధ్యాత్మిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం, మంత్రదీక్ష, శోభాయాత్ర, మహాపూర్ణాహుతి కార్యక్రమాలుంటాయి. తమిళ పురటాసి నెల ప్రారంభమైన సెప్టెంబర్ 17 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రతిరోజు భక్తులు శ్రీమన్నారాయణుడిని స్మరించుకుంటూ పాత్రలో చేర్చిన బియ్యాన్ని వేదికపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో సమతా ఇష్టి సేవా కమిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశంలోని సుమారు 3వేలకు పైగా గ్రామాలకు చెందిన లక్షలాది మంది భక్తులు పాల్గొనేలా వసతులు సమకూర్చినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)-చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్ రెడ్డి, నిర్వాహకులు తెలిపారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్

● స్పీకర్ అప్పావు



తిరునల్వేలిలో మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఏకపక్షంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావు ఆరోపించారు. తిరునల్వేలిలో గురువారం నిర్వహించిన పర్యావరణ అవగాహణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అప్పావు మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు ఈసీపై విమర్శలు చేశారు. తిరునల్వేలిలోని సెయింట్ జేవియర్ కళాశాల, కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్, తమిళనాడు సైన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అప్పావు మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలను కేంద్రప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ఈసీ కూడా ఆ రీతిలోనే వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారిని మళ్లీ కొత్తగా ఓటరు జాబితాలో చేర్చాల్సిన అవసరం ఏమొచ్చిందని, ముమ్మాటికీ ఇది రాజ్యాంగ వ్యతిరేకమేనన్నారు. ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ప్రజల నైతిక హక్కులను కాలరాస్తోందని, ఈ చర్యలను వ్యతిరేకిస్తూ ఎవరైన సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే మంచి తీర్పు వస్తుందని అప్పావు నమ్మకం వ్యక్తంచేశారు. కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన విజయ్ సీఎం అవ్వాలనే భ్రమలో ఉన్నారని, ఆయన లాంటి ఎంతో మంది నటులు రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి ఓటమి పాలైయ్యారన్న చరిత్ర మళ్లీ పునరావృతం అవుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ స్టాలినే సీఎం పదవిలో కూర్చుంటారని, ఆయనకు సామాన్యులు, యువకులు, మహిళల మద్దతు గతం కంటే బాగా పెరిగిందని అప్పావు తెలిపారు.

మా వాడిది హింసా రాజకీయం

● పీఎంకే అధినేత రాందాస్



మీడియాతో మాట్లాడుతున్న రాందాస్


చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ ప్రతిష్ఠను మంటగలిపేలా పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి హింసా రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దిండివనంలోని తైలాపురం గార్డెన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడిని కేంద్ర మంత్రి పదవిలో కూర్చోబెట్టి తాను పెద్ద తప్పు చేశానన్నారు. అన్బుమణికి పార్టీ అధ్యక్షపదవిని కట్టబెట్టడం రెండో తప్పన్నారు. తన నాయకత్వంలో పార్టీలో ఎలాంటి విబేధాలు, చీలికలు లేకపోయినా అన్బుమణి ప్రవర్తన కారణంగా పార్టీ చీలిపోయిందని ప్రత్యర్థులంతా భావించే స్థితికి తెచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలపాటు తనను తండ్రిగా భావించి అండగా నిలిచినవారంతా అన్బుమణి మాయమాటలకు అతడి వర్గంలో చేరి తీవ్రంగా విమర్శించడం తనకెంతో బాధ కలిగిస్తోందన్నారు. పీఎంకేకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు తనవెంటే ఉన్నారని, ముగ్గురు అన్బుమణి వర్గంలో చేరి తనను విమర్శిస్తున్నారని, ఎవరి మద్దతు వల్ల ఎన్నికల్లో గెలిచామనే స్పృహ కూడా వారికి లేదన్నారు సేలంలో ఓ పార్టీ నేత అంత్యక్రియల సందర్భంగా కుటుంబీకులను పరామర్శించేందుకు వెళ్ళిన తన వర్గానికి చెందిన ఎమ్మెల్యే అరుళ్‌పై కత్తులు, వేటకొడవళ్లతో దాడి జరిపించాడని పేర్కొన్నారు. ఇలా తన వర్గానికి చెందినవారిపై తన మద్దతుదారులను ఉసిగొల్పి అన్బుమణి ఏకంగా హింసా రాజకీయాలకు తెరలేపాడని రాందాస్ ఆరోపించారు. ఇలాంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడమే డీసెంట్, డిసిప్లిన్, డెవలప్‌మెంట్ పాలిటిక్స్‌గా అన్బుమణి భావిస్తున్నట్లుందని యెద్దేవా చేశారు.

కరూర్ దుర్ఘటన... మూడు బృందాలుగా సీబీఐ అధికారుల విచారణ

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో విజయ్ సభలో 41 మంది మృతిచెందిన వ్యవహారంపై, గురువారం సీబీఐ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. అదే సమయంలో, సీబీఐ విచారణ పర్యవేక్షణకు ప్రత్యేక బృందం కరూర్ రానున్నట్లు సమాచారం. కరూర్‌లో సెప్టెంబరు 27న జరిగిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన వ్యవహారంపై, ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని 12 మందితో కూడిన బృందం విచారణ చేపట్టింది. ఘటన జరిగిన ప్రాంతంలో సర్వే చేసి, విచారణకు హాజరుకావాలని వేలుచామిపురానికి చెందిన 306 మందికి సమన్లు అందజేయగా, 28 మంది మాత్రమే సీబీఐ అధికారుల ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. ఘటన జరిగిన రోజున వేలుచామిపురంలో బందోబస్తులో ఉన్న పోలీసులను కూడా సీబీఐ విచారించింది. సీబీఐ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి గురువారం విచారణ చేపట్టారు. కాగా, సీబీఐ విచారణ సమయంలో ఏం చెప్పాలి, టీవీకేకు అనుకూలంగా చెప్పాల్సిన మాటలు తదితరాలపై సమన్లు అందుకున్న వారిని ఓ న్యాయవాది సూచన చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, సీబీఐ విచారణ పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి, ఐపీఎస్ అధికారులు సుమిత్‌చరణ్, సోనల్ పి.మిశ్రాతో కూడిన బృందాన్ని సుప్రీంకోర్టు నియమించింది. ఈ బృందంలోని సుమిత్ చరణ్, సోనల్ పి.మిశ్రాలు గురువారం సాయంత్రం కరూర్‌కు చేరుకున్నారు.

డీఎంకే-టీవీకే మధ్యే పోటీ అంటూ విజయ్ కామెడీ

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం ఎద్దేవా



అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు ద్రావిడ పార్టీలకు బలమైన ఓటు బ్యాంకు ఉండగా, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే-టీవీకే మధ్య పోటీ ఉంటుందని విజయ్ చెప్పడం కామెడీగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం ఎద్దేవా చేశారు. నగరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కరూర్ ప్రచార సభలో అంత మంది మృతి చెందడం దేశ రాజకీయ చరిత్రలో లేదన్నారు. ఆ సమయంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా చేరారన్నారు. ఆ దుర్ఘటనలో పిల్లలు సహా 41 మంది మృతిచెందిన ఘటనకు బాధ్యత వహిస్తూ వారిని పరామర్శించాల్సిన టీవీకే అధ్యక్షుడు 'వర్క్ టు హోం'కు పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఇలా ఉన్నాయని అన్నారు. టీవీకే కొత్త పార్టీ అని, ఇప్పటివరకు ఒక్క ఎన్నిక కూడా ఎదుర్కోలేని ఆ పార్టీ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే-టీవీకే మధ్య పోటీ అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్నాడీఎంకే కూటమి ఏర్పాటుచేసి బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. అయినా బీజేపీకి ఓటమి భయం పోలేదని, అందుకే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) చేపట్టారన్నారు. ఫిబ్రవరిలో విడుదల కానున్న ఓటర్ల తుది జాబితాలో ఎందరి ఓట్లు గల్లంతయ్యాయో తెలుస్తుందన్నారు. ఎంజీఆర్ హయాం నుంచి నిలిపివేసిన విశ్వవిద్యాలయాలు, కళాశాల్లో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. వేలూరు జిల్లా అనైకట్టు వద్ద గురువారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి యువతకు పార్టీ టికెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా భావిస్తున్నారని, ఈ విషయంలో పార్టీ సీనియర్లు తప్పుకుని యువతకు మార్గం సుగమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లలో పారిశ్రామికాభివృద్ధి దిశగా ప్రభుత్వం 941 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని రూ.10లక్షల కోట్ల మేర పెట్టుబడులను సమీకరించినట్లు తెలిపారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద ప్రస్తుతం రాష్ట్రంలో 1.25 కోట్ల మంది గృహిణులు ప్రతినెలా రూ.1000లను పొందుతున్నారని, ఈ పథకం కోసం కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్నవారికి నిబంధనలను సడలించి ఈ యేడాది చివరినాటికి పథకాన్ని అమలు చేయనున్నామని ఉదయనిధి ప్రకటించారు.

ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం చెన్నైలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన డీజే శ్రీనివాసరాజ్ మర్యాదపూర్వకంగా కలిసారు.



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డీజే శ్రీనివాస రాజ్

సమాచార దర్శిని

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ సమస్యల పరిష్కార శిబిరాలు ఈ నెల 8వ తేది జరుగనున్నాయి. ఆహార సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా రేషన్ గ్రీవెన్స్ నిర్వహిస్తుంటారు. ఈ ప్రకారం, నవంబరు నెలకు సంబంధించి గ్రీవెన్స్ శనివారం నగరంలోని 19 మండల జోనల్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాల్లో జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో, రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చడం, తొలగించడం, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబరు మార్పు సహా పలు సేవలు పొందవచ్చు. అలాగే, రేషన్ దుకాణాల్లో అందించే సరుకుల నాణ్యత, కొలతల్లో తేడాలు, రేషన్ సరుకులు ప్రైవేటు దుకాణాల్లో విక్రయించడం సహా ఇతర సమస్యలపై ఫిర్యాదుచేయవచ్చని అధికారులు తెలిపారు.

రూ.127.57 కోట్లతో స్మార్ట్ తరగతులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 5,322 పాఠశాలల్లో రూ.127.57 కోట్లతో 6,672 స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఆ ప్రకారం, ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు భవనాలు, అధునాతన ల్యాబ్‌లు, గ్రంథాలయాలు తదితరాలు ఏర్పాటుచేస్తోంది. ఆ ప్రకారం, రూ.159 కోట్లతో 2,232 ప్రభుత్వ పాఠశాలల్లో 2,236 అత్యాధునిక లాబొరేటరీలు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. 2026-27 సంవత్సరం 6,672 స్మార్ట్ తరగతులు ఏర్పాటుచేసేందుకు టెండర్లు ఆహ్వానించింది. కాగా, 37,626 ప్రభుత్వ పాఠశాలల్లో 30,774 పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు, ల్యాబ్‌లు ఇప్పటికే ఏర్పాటుచేసినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఊటీలో రూ.40 లక్షలతో 'డాగ్ పార్క్'

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి డాగ్ పార్క్ ఊటీ బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటుకానుంది. ఈ పనులను గురువారం నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్యా తన్నీరు పరిశీలించారు. రూ.40 లక్షలతో ఏర్పాటవుతున్న ఈ పెట్ పార్క్‌లో, శునకాలకు ప్రత్యేక ఉపకరణాలు, పొదల మాటున ఏర్పాటుచేసిన సొరంగ మార్గం, ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ తదితరాలుంటాయి. ఈ పార్క్ పనులను నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే, రక్షణ గోడ, పార్క్ పేరుతో బోర్డు తదితరాల ఏర్పాటుపై సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు.

నేటినుంచి కుట్రాలంలో సందర్శకులకు అనుమతి

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో, శుక్రవారం నుంచి కోవై జిల్లా కుట్రాలం జలపాతాన్ని ప్రజలు సందర్శించవచ్చని అటవీ శాఖ తెలిపింది. ఈ మేరకు అటవీ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... పశ్చిమ కనుమల్లో వర్షాల కారణంగా కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం అధికమై, రక్షణ కంచెలు, గోడలు కొట్టుకుపోయాయని తెలిపింది. ఈ కారణంగా పర్యాటకుల భద్రత దృష్ట్యా కుట్రాలం జలపాతానికి వెళ్లేందుకు పర్యాటకులకు నిషేధం విధించినట్లు తెలిపింది. ప్రస్తుతం దెబ్బతిన్న కంచెలు, రక్షణ గోడలకు చేపట్టిన మరమ్మతులు పూర్తికావడంతో, పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టి, కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో, శుక్రవారం నుంచి కుట్రాలంకు సందర్శకులను అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ తెలిపింది.

వారాంతపు సెలవులకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా సొంతూళ్లు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సౌకర్యార్థం 920 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 340 బస్సులు, శనివారం 350 ప్రత్యేక బస్సులు చొప్పున నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాలు తలా 20 బస్సులు చొప్పున నడుపనున్నారు. ఇక, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి పలు ప్రాంతాలకు 100 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

ఢిల్లీ వెళ్లిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లారు. నగరం నుంచి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో ఢిల్లీకి వెళ్లిన ఆయన రాత్రికి అక్కడే బస చేయనున్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగే క్రీడలకు సంబంధించి కార్యక్రమంలో ఉదయనిధి పాల్గొంటారు. అనంతరం సాయంత్రం ఢిల్లీ నుంచి తిరిగి నగరానికి చేరుకుంటారని సచివాలయ వర్గాల సమాచారం.

చేపల పెంపకంపై శిక్షణ

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మత్స్య విశ్వవిద్యాలయం, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా 'కిబిట్ తిలాపియా' చేపల పెంపకంపై శిక్షణ అందించనున్నాయి. 8వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్లలోపున్న వారు శిక్షణలో పాల్గొనవచ్చు. మాధవరం మత్స్య విశ్వవిద్యాలయంలో 14 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు 8754678309 అనే నెంబరు సంప్రదించవచ్చని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

నగరంలో అర్ధరాత్రి బైక్ రేస్.. ఇద్దరి మృతి





ప్రమాదం జరిగిన దృశ్యం - మృతులు సుహైల్, కుమరన్ (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలో బుధవారం అర్ధరాత్రి బైక్ రేస్‌లో ప్రమాదం జరిగి ఇద్దరు మృతిచెందారు. నగరంలో యువకులు బైక్ రేస్‌లు నిరవహించి పాల్పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రేస్‌లు అరికట్టేందుకు పోలీసులు గస్తీ చేపట్టినా, నగరం, శివారు ప్రాంతాల్లో బైక్ రేస్‌లు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో, రాయపేట పీటర్స్ ఫ్లై ఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి బైక్ రేస్ జరిగింది. కళాశాల విద్యార్థి సుహైల్ (19), అతని స్నేహితుడు జోయల్ బైక్ రేస్ చేశారు. పీటర్స్ ఫ్లై ఓవర్‌పై కుమరన్ అనే వ్యక్తి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా, సుహైల్ నడిపిన రేస్ బైక్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు బైక్‌ల నుంచి కిందపడ్డారు. సుహైల్, కుమరన్ తలలకు తీవ్రగాయాలు కావడంతో వారు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో గాయపడిన జోయల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన రాయపేట పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.2.20 లక్షలకు ఆడ శిశువు విక్రయం

● తల్లిదండ్రులు సహా ఆరుగురి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు నెలల ఆడశిశువు విక్రయించిన వ్యవహారంలో తల్లి, తండ్రి సహా ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దురైపాక్కం కన్నగినగర్ ఎళిల్ నగర్‌కు చెందిన పెయింటర్ శ్రీజి (27)కి వినీష (23) అనే భార్య ఉంది. ఈ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలుండగా, గత మే 4వ తేది మరో ఆడబిడ్డకు పుట్టింది. పేదరికంగా కారణంగా మూడు నెలల ఆడబిడ్డను విక్రయించాలని ఆ దంపతులు నిర్ణయించారు. అత్త సరళ (45)తో కలసి, ఆడబిడ్డను విక్రయించేందుకు సహకరించాలని తన స్నేహితురాలు శివరంజినికి వినీషా కోరింది. ఈ విషయాన్ని శివరంజిని తన అత్త సహాయమేరికి చెప్పగా, ఆమె తన స్నేహితురాలు సుమతికి తెలిపింది. ఈ క్రమంలో, తిరువణ్ణామలైలో వివాహమై పదేళ్లు గడిచినా పిల్లలు లేని దంపతులకు ఆడబిడ్డను విక్రయించేందుకు సుమతి ఏర్పాట్లు చేసింది. అందుకు, శ్రీజి-వినీషా దంపతులకు రూ.2.20 లక్షలు అందించారు. అందులో, శివరంజినికి రూ.15 వేలు, సహాయమేరీకి రూ.5 వేలు, సరళకు రూ.50 వేలు ఆ దంపతులు అందజేశారు. బిడ్డను గత జూలైలో తిరువణ్ణామలైకి చెందిన దంపతులకు అందించారు. బిడ్డకు పాలు ఇప్పించేందుకు తిరువణ్ణామలై దంపతులు వారంలో ఒకరోజు కన్నగి నగర్‌కు వస్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లల సంక్షేమ అధికారులు కన్నగి నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించిన పోలీసులు, బిడ్డను కొనుగోలు చేసిన దంపతులు, విక్రయించేందుకు సహాయం చేసిన వారు అని మొత్తం 8 మందిపై కేసు నమోదుచేశారు. ఈ వ్యవహారంలో శ్రీజి, వినీషా, అత్త సరళ, శివరంజిని, సహాయమేరి, సుమతిలను అరెస్ట్ చేసిన పోలీసులు, బిడ్డను ప్రభుత్వ హోంకు అప్పగించారు.

నకిలీ నశ్యం తయారీ.. ముగ్గురి కోసం గాలింపు

అడయార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేటలో ప్రముఖ సంస్థ పేరుతో నకిలీ ముక్కుపొడి (నశ్యం) తయారుచేస్తున్న వ్యవహారంలో పరారైన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తండయారుపేట ప్రధాన కేంద్రంగా ఓ సంస్థ ముక్కుపొడి తయారుచేస్తోంది. ఈ సంస్థ తయారుచేస్తున్న ముక్కుపొడి రాష్ట్రంతో పాటు ఆంధ్ర ప్రదేశ్ సహా పలు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కొద్దిరోజుల క్రితం ముక్కుపొడి నాణ్యత తక్కువగా ఉందనే ఫిర్యాదుతో, ఆ సంస్థ చేపట్టిన పరిశోధనల్లో నకిలీ ముక్కుపొడి అని తెలిసింది. ఈ వ్యవహారంపై సంస్థ మేనేజర్ సిమియోన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ వ్యవహారంపై సీఐ రమేష్ చేపట్టిన విచారణలో... కొడుంగైయూర్ కేకేడీ అబిరామి అవెన్యూ 16వ వీధిలోని ఓ ఇంట్లో నకిలీ ముక్కుపొడి తయారుచేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి ముక్కుపొడి తయారీ ముడిసరుకులు, లేబుల్స్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న శీనిరాజ్, మణికంఠన్, యమరాజ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పోక్సో కేసులో పరిహారం పెంచాలంటూ పిటిషన్

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో బాధితులకు పరిహారం పెంచాలంటూ దాఖలైన కేసులో, రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేయాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురై తెల్లూరుకు చెందిన షర్మిల హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... పోక్సో కేసుల్లో లైంగిక వేధింపులకు గురైన బాలలకు అందించే పరిహారం 'ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ (నేషనల్ లీగల్ ఎయిడ్ కమిషన్)' పరిహార పథకం కింద ఇచ్చే దాని కంటే తక్కువగా ఉందని తెలిపారు. పోక్సో కేసులో మహిళా బాధితులకు పరిహారం మొత్తం నిర్ణయించడంలో గందరగోళం నెలకొందని వివరించారు. ఈ కేసుల్లో అందించే పరిహారం పెంచాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్‌తో కూడిన ధర్మాసనం దీనికి సంబంధించి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, డైరెక్టర్, మహిళలు పిల్లల నేర నియంత్రణ విభాగం డీజీపీ, రాష్ట్ర చట్టపనుల కమిషన్ సభ్యుల కార్యదర్శి తదితరులు అఫిడవిట్ దాఖలుచేయాలని నోటీసు జారీచేసి, విచారణ వాయిదా వేసింది.

జనవరిలోనే కూటమిపై స్పష్టత

● అన్నాడీఎంకే నేత ఆర్బీ ఉదయ్‌కుమార్



ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పాటు కానున్న కూటమిలో ఏఏ పార్టీలుంటాయన్న స్పష్టత జనవరి నాటికి వస్తుందని మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మదురైలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన డీఎంకే కంటే అన్నాడీఎంకే పోటీ చేసిన 43 నియోజకవర్గాల్లో 1,92,000 ఓట్లు మాత్రమే తగ్గి అధికారం కోల్పోయిందన్నారు. సుమారు ఐదున్నర కోట్ల మంది ఓటర్లలో లక్ష 92వేల ఓట్లు తమ పార్టీకి వచ్చి ఉంటే తామే అధికారంలో ఉండేవాళ్లమని, ఈ అవకాశం 2026లో ప్రజలు తమకు తప్పకుండా కల్పిస్తారని తెలిపారు. కూటమికి సారథ్యం వహించడంతో పాటు సీఎం అభ్యర్థి కూడా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామేనని, ఇందులో మార్పులు జరిగేందుకు అవకాశం ఉండబోదన్నారు.



విద్యాశాఖ అధికారికి సత్కారం

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లాలో విద్యాధికారిగా పనిచేసిన ప్రేమలత ఇటీవల వేలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో, ఆమె గురువారం ఉదయం విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు వేలూరు జిల్లా తమిళనాడు సైన్స్ ఇయక్క కార్యదర్శి జనార్ధనన్ గురువారం ఉదయం ఆమెను సత్కరించి ఘన స్వాగతం పలికారు. సంస్థ నిర్వాహకులు కుమరన్, విశ్వనాథన్, శడగోపన్, మాసిలమణి తదితరులు పాల్గొన్నారు.

'ట్రెక్కింగ్' పథకంలో కొత్తగా ఏడు ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీ శాఖ అమలుచేస్తున్న ట్రెక్కింగ్ (కొండలు ఎక్కడం) పథకంలో కొత్తగా ఏడు ప్రాంతాలు ఎంపిక చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎకో-టూరిజం ప్రాజెక్ట్ అమలులో ఉంది. ఇందులో భాగంగా అటవీ శాఖ ట్రెక్కింగ్‌కు వెళ్లే వారికోసం క్షేత్రస్థాయి కార్యకర్తల మార్గదర్శకత్వంలో ప్రత్యేక పథకం పరిచయం చేసింది. ఈ పథకంలో కోవై, దిండుగల్, నీలగిరి సహా 14 జిల్లాల్లోని 40 ప్రాంతాల్లో గత ఏడాది నుంచి ట్రెక్కింగ్‌కు అనుమతించారు. ప్రజలు ముందుగానే ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదుచేసుకుంటే తగిన ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లవచ్చు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరు చివరలో ట్రెక్కింగ్ పథకం పరిచయం చేయగా గత ఏడాది 15,500 మంది పాల్గొన్నారన్నారు. వారిలో మూడింట ఒక వంతు మంది మహిళలున్నారని తెలిపారు. 130 మంది గైడ్‌లు సరైన శిక్షణతో ఇందులో పాల్గొంటున్నారన్నారు. తాజాగా ట్రెక్కింగ్ కార్యక్రమంలో మరో ఏడు ప్రాంతాలు చేర్చామన్నారు. ఆ ప్రకారం దిండుగల్ జిల్లాలోని కుంభక్కారై వెల్లగవి, కొడైకెనాల్ వెల్లగవి, వెల్లగవి క్యాంప్ స్టే, తిరుప్పూర్ చిన్నర్ చెక్ పోస్ట్, కోయంబత్తూర్ జిల్లా మనంపల్లి, తిరువళ్లూర్ జిల్లాలోని గుడియం గుహలు, నీలగిరి జిల్లాలోని జెన్‌పోల్ తదితర ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు అనుమతించనున్నామన్నారు. ఫీజు వివరాలు https://trektamilanadu.com/ అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రతలేదు

● బీజేపీ నేత దశరథన్



వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోవైలో కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటనను ఖండిస్తూ వేలూరు జిల్లా బీజేపీ నేతలు గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దశరథన్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు మంజుల, సుభాషిణి, అముదా, వినోదిని, నిత్య, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'సర్'ను అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోండి



వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను అడ్డుకునేవారిపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి వేల్‌అళగన్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు

● పీఎంకే నేత అన్బుమణి విమర్శ

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి డిమాండ్ చేశారు. ఆయన ధర్మపురిలో గురువారం ఉదయం జరిగిన సభలో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు మేరకు రిజిస్ట్రేషన్ విభాగంలో ఖాళీ పోస్టులను భర్తీచేయాల్సివుందని, అయితే ఈ డీఎంకే ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ విభాగంలో 2009 నుండి 2020వ సంవత్సరం వరకు జిల్లా రిజిస్ట్రార్ల ఎంపికకు సాధించిన మార్కుల ఆధారంగా అర్హులైన ఉద్యోగుల ఎంపిక జాబితా ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ తర్వాత ఈ విధానం అమలు జరగడంలేదని అన్బుమణి ఆరోపించారు.

మాదకద్రవ్యాల విక్రయం 8 మంది అరెస్ట్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మన్నాడి ప్రాంతంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 8 మంది ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మన్నాడి ప్రాంతంలో మాదకద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఫిర్యాదు మేరకు మాదకద్రవ్యాల నియంత్రణ అధికారులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. పోలీసులు సాధారణ వ్యక్తులుగా వెళ్లి మహ్మద్ సాలిక్‌ను అరెస్ట్ చేశారు. అతడిచ్చిన సమాచారంతో ఎలిఫెంట్ గేట్ ప్రాంతానికి చెందిన అష్రఫ్ అలి, రాయపురానికి చెందిన లైలా పఠానియా, ఆమె కుమార్తె షమీనా సహా 8 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 22 గ్రాముల మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిళ్లలోనే మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. నగరవ్యాప్తంగా భారీ నెట్‌వర్క్ ఏర్పాటుచేసి విద్యా సంస్థలు, సమీపంలోని స్టార్ హోటళ్లలో జరిగే పార్టీలకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తుంటారని తెలిసింది. నిందితులను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

డిసెంబరు 14న నేవీ ఆధ్వర్యంలో మారథాన్

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత నావికాదళం డిసెంబరు 14న నగరంలో 'చెన్నై హాఫ్ మారథాన్' పేరుతో మొట్టమొదటి మారథాన్ నిర్వహించనుంది. ఈ మారథాన్ ఇప్పటికే ముంబై, విశాఖలో నిర్వహించారు. మారథాన్ 'ఐఎన్‌ఎస్ అడయారు' అనే పేరుతో 21.1 కి.మీ, 'ఐఎన్‌ఎస్ పరుండు' పేరుతో రూ.10 కి.మీ, 'ఐఎన్‌ఎస్ పల్లవ' పేరుతో 5 కి.మీ మేర నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి నమోదుచేసుకున్న వారు మాత్రమే మారథాన్‌లో పాల్గొనేందుకు అనుమతించనున్నారు. నేపియర్ బ్రిడ్జి దగ్గర ప్రారంభమై ఐఎన్‌ఎస్ అడయార్ బీచ్ వద్ద మారథాన్ ముగియనుంది. విజేతలకు సుమారు రూ.10 లక్షల విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నారు. వివరాలకు chennainavyhalf-marathon.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు మాక్‌డ్రిల్



వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని రోటరీ సంఘం, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోటరీ సంఘ అధ్యక్షుడు చంద్రన్ అధ్యక్షత వహించగా, గుడియాత్తం అగ్నిమాపకశాఖ అధికారి శరవణన్ మాక్‌డ్రిల్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ అశీల, రోటరీ నిర్వాహకులు మేఘరాజ్, వాసుదేవన్, కన్నన్, సురేష్, జయచంద్రన్ శివరాజ్, మణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో 79,462 మంది క్షయ బాధితులు

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 79,642 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో క్షయ వ్యాధిని త్వరంగా గుర్తించేలా కిట్లు ఏర్పాటుచేశామన్నారు. క్షయ వ్యాధి బారిన పడిన వారు పోషకాహారం తీసుకునేలా, ప్రతినెలా రూ.1,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 79,642 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి తగిన చికిత్సలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో మరో స్వాతంత్ర్య పోరాటం

● బీజేపీ నేత తమిళిసై

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి మహిళలు సిద్ధమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. నగరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకోవాలని ప్రధాని మోదీ కోరారన్నారు. ప్రధాని పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7,8 తేదీల్లో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఓ యువతిపై లైంగిక వేధింపులకు గురికావడం దిగ్భ్రాంతి కలిగిస్తుందన్నారు. గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలాంటి ఘటన జరిగితే స్టాలిన్, కనిమొళి, వైగో, తిరుమావళవన్, కమ్యూనిస్టు నేతలు వెంటనే దానిని ఖండిస్తూ ప్రకటనలు గుప్పించి ఉండేవారని, కానీ, రాష్ట్రంలో జరిగితే మాత్రం వారందరూ మౌనంగా ఉన్నారని ఆరోపించారు.

సకాలంలో వంతెన పనులు పూర్తిచేయండి

● అధికారులకు కలెక్టర్ ప్రతాప్ ఆదేశం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వేపంపట్టులో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి పనులను గురువారం కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. 15యేళ్ల క్రితం ప్రారంభమైన ఈ వంతెన నిర్మాణ వలన తమ భూములు కోల్పోవాల్సివస్తుందని కోర్టును ఆశ్రయించిన స్థానికుల పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం అప్పట్లో స్టే విధించింది. అదేవిధంగా నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్ కూడా వైదొలగడంతో రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయింది. ఇటీవల ఆ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోవడంతో తిరిగి ఈ పనులను కలెక్టర్ ప్రతాప్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆయన నిర్మాణం పనులు పరిశీలించి సకాలంలో పనులను పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సబర్బన్ రైలు ఢీకొని ఒకరి మృతి



మృతుడు శరత్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలో సబర్బన్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టాభిరామ్ వల్లలార్ నగర్‌కు చెందిన శరత్ (34)కు అనిత (30) అనే భార్య ఉంది. శరత్ ఆవడి గాంధీ నగర్‌లో క్రీడా పరికరాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ దుకాణం నడుపుతున్నాడు. బుధవారం రాత్రి దుకాణం మూసివేసి, ఇంటికి వెళ్లేందుకు రైలుపట్టాలు దాటుతున్న సమయంలో, చెన్నై నుంచి అరక్కోణం వెళ్తున్న సబర్బన్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో శరత్, ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఆవడి రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వేలూరులో విస్తృతంగా 'సర్'



ప్రజలకు దరఖాస్తులు అందజేస్తున్న కలెక్టర్

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులను గురువారం ఉదయం వేలూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి ప్రారంభించారు. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన అప్లికేషన్లను ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించించి సర్వే నిర్వహించారు కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, తాహసీల్దార్ వడివేలు సహా ఎన్నికల నిర్వాహణాధికారులు పాల్గొన్నారు.

'సర్'కు వ్యతిరేకంగా 11న డీఎంకే, మిత్రపక్షాల ధర్నా

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ డీఎంకే, దాని మిత్రపక్షాలు ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా, రాస్తారోకో నిర్వహించనున్నాయి. అన్ని జిల్లా కేంద్రాల్లో జరుగనున్న ఈ ఆందోళనలో డీఎంకే, కాంగ్రెస్, డీపీఐ, వామపక్షాల పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని డీఎంకే ఓ ప్రకటన జారీ చేసింది.

కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు వేలూరు జిల్లా పేర్నాంబట్టు తదితర ప్రాంతాల్లో గంజాయి, గుట్కా తదితర మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వేగంగా వస్తున్న ఓ కారును ఆపి అందులో తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. విచారణలో వారు ఆంబూరుకు చెందిన శ్రీరామ్, అశోక్ గా తెలిసింది. కోర్టులో హాజరుపరిచిన అనంతరం పోలీసులు వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు.

87 మంది పారిశుధ్య కార్మికులపై కేసు

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కి వ్యతిరేకంగా మెరీనా సముద్రంలో దిగి నిరసన తెలిపిన 87 పారిశుధ్య కార్మికులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జీసీసీ పరిధిలోని ఐదు, ఆరు జోన్లలోని తాత్కాలిక కార్మికులు ఆ జోన్లను ప్రైవేటీకరణ చేయడాన్ని తప్పుబడుతూ గత 97 రోజులుగా రకరకాలుగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కాగా, బుధవారం ఉదయం మెరీనా సముద్రంలో దిగి వినూత్నంగా నిరసన తెలిపారు. సముద్రంలో దిగిన 65 మంది, వారికి మద్దతు తెలిపిన 22 మంది మొత్తం 87 మంది పారిశుధ్య కార్మికులను అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, ఈ కార్మికులపై పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం.

సాయిశ్రీ పాఠశాలలో 'ఎల్లో డే' వేడుకలు

తిరుత్తణి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సాయిశ్రీ మెట్రిక్యులేషన్ పాఠశాలలో గురువారం 'ఎల్లోడే' (పసుపు రంగు దినోత్సవం) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ ప్రిన్సిపల్ మథాయి సంపత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు పసుపు రంగు, పైనాపిల్, ఆరెంజ్ రంగు వస్త్రాలతో పాఠశాలకు వచ్చి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం వివిధ రకాల పసుపు రంగు వేషధారణలో వచ్చిన విద్యార్థులను అభినందించి వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కే. బీబ్జాన్, వాసుకి, వైజయంతి, శారద సహా చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాఠశాల నిర్వాహకులు

తిరువణ్ణామలైలో బాబీ సిన్హా పూజలు


ఆలయంలో ధ్యానం చేస్తున్న బాబీ సిన్హా

వివిధ పాత్రల్లో కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటుడు బాబీ సిన్హా గురువారం తన 43వ జన్మదిన వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర సీమకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా జన్మదినం సందర్భంగా బాబీ సిన్హా యాన తిరువణ్ణామలై ఆలయానికి వెళ్ళి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పావుగంటసేపు ధ్యానం చేశారు. ఆలయం నుండి బయటకు వచ్చిన తర్వాత అభిమానులు ఆయనను చుట్టుముట్టారు. అభిమానులతో సెల్ఫీలు తీసుకున్నాక ఆయన అక్కడి నుంచి చెన్నై వెళ్లారు. కార్తీక్ సుబ్బురాజ్ దర్శకత్వం వహించిన 'పిజ్జా' మూవీ ద్వారా చిత్రసీమకు పరిచయమైన బాబీ సిన్హా 'సూదు కవ్వుమ్, జిగర్‌దండా, మహాన్' చిత్రాలలో నటించి అభిమానులను సొంతం చేసుకున్నారు.

21న 'తీరవర్ కులై నడుంగ' రిలీజ్


అర్జున్, ఐశ్వర్యా రాజేష్

యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్యా రాజేష్ జంటగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'తీయవర్ కులై నడుంగ'. ఈ మూవీ ద్వారా దినేష్ లక్ష్మణన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జీఎస్ ఆర్ట్స్ బ్యానర్‌పై జి.అరుళ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం అర్జున్ సినీ కెరీర్‌కు మరో టర్నింగ్ పాయింట్‌ని ఇస్తుందని దర్శకుడు తెలిపారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ మూవీని ఈ నెల 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నామని ఆయన చెప్పారు.

మణిరత్నం డైరెక్షన్‌లో విజయ్ సేతుపతి

'థగ్‌లైఫ్' తర్వాత స్టార్ డైరెక్టర్ మణిరత్నం చిత్రంలో విజయ్‌సేతుపతి నటించనున్నారు. మణిరత్నం తాజాగా సిద్ధం చేసిన స్క్రిప్ట్‌ను ప్రముఖ హీరోలు శింబు, విజయ్‌సేతుపతికి చూపెట్టారు. ఇద్దరూ కథ చాలా బాగుందని కితాబిచ్చారు. అయితే అశ్వంత్ చిత్రంలో శింబు బిజీగా ఉండటంతో నటించలేనని తెలిపారు. అదే సమయంలో విజయ్ సేతుపతి కాల్షీట్లుండటంతో ఆయనను బుక్ చేసుకున్నారు. కమల్‌హాసన్ తర్వాత బిగ్‌బాస్ ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు కూడా బాగా దగ్గరైన విజయ్‌సేతుపతి మణిరత్నం డైరెక్షన్‌లో నటించి సెన్సేషనల్ సృష్టిస్తారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం విజయ్‌సేతుపతి సరసన రుక్మిణీ వసంత్ నటించనున్నదని సమాచారం.




చిత్రజ్యోతి

ప్రాధాన్యత లేకుంటే పెద్ద స్టార్ల చిత్రాల్లో కూడా నటించను

● మాళవికా మనోజ్




'జో' మూవీ ద్వారా తమిళ చిత్రసీమలో అడుగుపెట్టిన కేరళ బ్యూటీ మాళవికా మనోజ్ ప్రస్తుతం తమిళంలోనే కాక తెలుగు, మలయాళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటున్నారు. పదో తరగతి చదువుతున్నప్పుడే మాళవిక మాలీవుడ్‌కు పరిచయమైంది. తమిళంలో 'జో, నాయడి' చిత్రాలలో నటించిన మాళవిక చాలా గ్యాప్ తర్వాత 'ఆన్‌పావమ్ పొల్లాదదు' నటించారు. ఇంత గ్యాప్ రావటానికి కారణం ఏమిటని ప్రశ్నించగా, స్టోరీ నచ్చితేనే ఏ భాషా చిత్రంలో అయినా నటించేందుకు సిద్ధమేనని, కథ నచ్చకపోతే ఆ చిత్రంలో పెద్ద స్టార్లు ఉన్నా పట్టించుకోనని ఆమె స్పష్టం చేశారు. ఎవరినైనా లవ్ చేస్తున్నారా అని అడిగినప్పుడు లవ్ చేయడానికి టైమ్ లేదని నవ్వుతూ బదులిచ్చారు. ప్రస్తుతం స్టోరీ వెయిట్ కలిగిన మూవీలోనే నటిస్తానని స్పష్టం చేశారు.


కొండ ఆలయానికి మెట్ల మార్గం - గర్భాలయ గోపురం

జ్ఞానగురువుగా దర్శనమిచ్చే

దండాయుధపాణి


పచ్చటి పర్వతం మధ్యలో ఆలయం

● కౌపీనధారిగా కొలువైన కుమారస్వామి

● ఏడు కొండల నడుమ అలగుమలై పర్వతాలయం


ఆలయ ముఖ మండపం

కొంగునాడులోని సుప్రసిద్ధ మురుగన్ ఆలయాల్లో తిరుప్పూరు జిల్లాలోని అలగుమలై ఆలయం అత్యంత శ్రేష్ఠమైంది. ఆ కొండపై వెలసిన ముత్తుకుమారస్వామి.. పళని పర్వతంపై బాల దండాయుధపాణి ఆలయంలో స్వామివారున్నట్లే కౌపీనధారుడై దండాయుధంతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. 'కుండ్రిరుక్కుమ్ ఇడమెల్లామ్ కుమరన్ ఇరుప్పాన్' (కొండలున్న ప్రాంతాల్లో కుమారస్వామి కొలువై ఉంటాడు) అంటూ శైవ భక్తశిఖామణులు చెబుతుంటారు. ఆ ప్రకారమే పచ్చటివాతావరణం మధ్యలో ఉన్న ఈ పర్వతాలయంలో బాల దండాయుధపాణి స్వామి భక్తులచేత అనుగ్రహమూర్తిగా పూజలందుకుంటున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

అలగుమలైకి ఆ పేరెలా వచ్చింది?

'అలగు' అంటే తమిళంలో 'ముక్కు' అని అర్థం. ఈ ఆలయమున్న కొండ నెమలి ముక్కు ఆకారంలో ఉండటం వల్ల దీనికి 'అలగుమలై' అనే పేరొచ్చిందని చెబుతారు. కొండదిగువ 'అలగాపురి అమ్మన్' అనే అమ్మవారు గ్రామ కావలి దైవంగా స్థానికులను కంటికి రెప్పలా కాపాడుతుండటంతో ఈ కొండను 'అలగుమలై' అని పిలుస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. సూర్యుడి చుట్టూ నవగ్రహాలు ఉన్నట్లు ఈ అలగుమలై చుట్టూ ఏడు కొండలున్నాయి. చెన్నిమలై, శివన్‌మలై, వట్టమలై, ఊదియూర్ మలై, పళనిమలై, మరుదమలై, కతిత్త మలై అనే ఏడు కొండల నడుమ ఈ అలగుమలై దివ్యక్షేత్రం ఉండటం మరీ విశేషం.


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

స్థలపురాణం...

ఓ పర్యాయం కైలాసంలో మురుగప్పెరుమాన్ ఆడుతుండగా వచ్చిన పార్వతీదేవీ, గంగాదేవీ తమ దగ్గరకు రమ్మని పిలిచారు. అది పట్టించుకోకుండా బాలస్వామి ఆటపైనే దృష్టిసారించాడు. ఆ సమయంలో పరమేశ్వరుడు కూడా మురుగప్పెరుమాన్ వద్దకు వచ్చి' ఇద్దరు తల్లుల్లో ఎవరిష్టం? గంగాదేవా? లేక పార్వతీదేవా? అంటూ ప్రశ్నించారు. అయితే బాలస్వామి సమయోచితంగా ఆ ఇద్దరు తల్లులు మెచ్చుకునేలా బదులిచ్చారు. 'నన్ను కంటికి రెప్పలా కాపాడే 'అరన్ మాత' అంటే నాకెంతో ఇష్టం' అని సమాధానం ఇచ్చారు. సమయోచితంగా ఇచ్చిన ఆ సమాధానానికి పార్వతీ పరమేశ్వరులు గాంగాదేవీ సంతసించారు. కార్తికేయుడిచ్చిన సమాధానంలో తమిళ పదం 'అరన్' అంటే ధర్మం అని అర్థం. ధర్మాన్ని పెంచి పోషించే తల్లి పార్వతీదేవి అంటే ఇష్టమని ఒక సమాధానమైతే, 'అరన్' అనే పదానికి 'జీవజలం' అనే అర్థం కూడా ఉంది. అంటే సకలజీవరాశిని కాపాడే గంగాదేవి అంటే ఇష్టమని మరొక అర్థం.. ఇలా ఒకే సమాధానంతో ఇద్దరు తల్లులను మురిపించిన ఆ బాలదండాయుధపాణి అలగుమలైపై కొలువై ఉన్నారు.

ఆలయ వైభవం...

అలగుమలై ఆలయం తూర్పు, పడమర దిశలుగా నిర్మితమై ఉంది. తూరు దిశలో కాస్త దిగువగా, పడమటి వైపు కాస్త ఎత్తుగా ఉంటుంది. స్వామివారిని దర్శించేందుకు సుమారు 300 మెట్లు ఎక్కి వెళ్తారు. కొండదిగువ ప్రాంతంలో మయూర వాహన మండపం ఉంది. మెట్లెక్కి వెళితే అష్టస్తంభాల మండపం, ఆ మండపాన్ని దాటి వెళ్తే ఎడమవైపు పాద వినాయకుడు దర్శనమిస్తారు. వినాయకుడిని పూజించి పైకి వెళ్తే కార్తీక మండపంలో మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాలను దర్శించవచ్చు. ఈ 'ఆరుపడై వీడుగళ్' ఆలయం 1984లో నిర్మించారు. ఈ ఆలయానికి చేరువగా నవగ్రహాల సన్నిధి, వినాయకుడి సన్నిధి ఉన్నాయి. ఆ తర్వాత పడమటి దిశలో మెట్లను దాటుకుని వెళితే ఎడమవైపున ఇడుంబన్ సన్నిధి ఉంది. ఆ తర్వాత కుళందై కుమారర్ సన్నిధి. చివరగా గర్భాలయం ఎదుట ధ్వజస్తంభం, ఆ స్తంభానికి పడమటి దిశగా మయూరవాహనం, బలిపీఠం, ఆలయం ఎడమవైపు స్థలవృక్షమైన బిల్వ వృక్షం ఉన్నాయి. ఆలయ మహామండపంలో కుడివైపున ఆనంద వినాయకుడు, దక్షిణావర్త వినాయకుడు దర్శనమిస్తారు. ఎడమవైపు వీరబాహు దేవర్ కొలువై ఉన్నారు. గర్భాలయంలో మురుగప్పెరుమాన్ సుమారు నాలుగున్నర అడుగుల ఎత్తులో 'ముత్తుకుమార బాల దండాయుధపాణి' అనే తిరునామంతో భక్తులకు దర్శనమిస్తున్నారు. దండాయుధంతో ఈ స్వామివారు జ్ఞానగురువుగా దర్శనమిస్తున్నారు. గర్భాలయంలో మురుగన్ కౌపీనధారుడై ఉండటం వల్ల ఇష్టదేవేరులైన వళ్ళి, దైవానై పడమటి వైపు ప్రత్యేక సన్నిధుల్లో దర్శనమిస్తారు. కొండకింద కైలాసనాధర్ ఆలయంలో క్రీ.శ. 1641 సంవత్సర నాటి శిలా శాసనంలో ఈ ఆలయానికి తిరుమలై నాయకర్ జీర్ణోద్ధరణ పనులు జరిపినట్లు వివరణ ఉంది.


గర్భాలయ ప్రవేశ ద్వారం

ఆధ్యాత్మికం


మూలవిరాట్టు

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు, వైయ్యాశి విశాఖం, పంగుణి ఉత్తిరం, స్కందషష్ఠి, కార్తీక దీపోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. పౌర్ణమి దినాల్లో భక్తులు ఇక్కడ గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. జనవరిలో తైపూస ఉత్సవాలు ఏడు రోజులపాటు జరుగుతాయి. ఆ ఉత్సవాల చివరి రోజు భక్తులు క్షీరకలశాలను శిరస్సుపై మోసుకెళ్ళి స్వామివారికి సమర్పిస్తారు. వివాహితులు ఈ ఆలయంలో షష్ఠి వ్రతమాచరించి స్వామివారికి పుష్పమాలలతో అలంకరించి, పెరుగుతో అభిషేకం చేయిస్తే సంతానం కలుగుతుందని శైవ పండితులు చెబుతున్నారు.

ఎలా వెళ్లాలి?

రాజధాని నగరం చెన్నై సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి తిరుప్పూరుకు బస్సులు వెళతాయి. అక్కడి నుంచి కొడువాయ్ ప్రాంతానికి వెళ్లే రహదారిలో 22 కి.మీ.ల దూరంలో ఈ అలగుమలై ముత్తుకుమారస్వామి దండాయుధపాణి ఆలయం ఉంది. కొండదిగువ నుండి కాలినడక మెట్లదారిలో ఆలయాన్ని చేరుకోవచ్చు. కొండపైకి వాహనాలు వెళ్లటానికి రహదారి సౌకర్యం కూడా ఉంది. ఈ ఆలయాన్ని ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మళ్ళీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


సముద్రం వెనక్కితగ్గడంతో బయటికి కనిపిస్తున్న పాచిపట్టిన బండరాళ్లు

తిరుచెందూర్‌లో రెండో రోజూ వెనక్కి వెళ్లిన సముద్రం

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం నుంచి అయ్యా వైకుంఠర్ అవతార్ ఆలయం వరకు సముద్రం రెండో రోజైన గురువారం కూడా సుమారు 80 అడుగుల వెనక్కి మళ్లడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సముద్రం ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి, అష్టమి, నవమి తిథుల్లో ఉదయం వెనక్కి వెళ్లి, సాయంత్రం యథాస్థాయికి చేరుకోవడం సహజంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో, బుధవారం ఐప్పసి పౌర్ణమి సందర్భంగా సముద్రం సుమారు వందడుగుల మేర వెనక్కి వెళ్లింది. ఈ క్రమంలో రెండో రోజు కూడా ఈ తీరం వెంబడి 80 అడుగుల మేర సముద్రం వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన బండరాళ్లు బయటికి కనిపించాయి. ఈ ప్రాంతంలో వరుసగా రెండు రోజులు కడలి వెనక్కి వెళ్లడంపై భక్తులు ఆందోళనకు గురైయ్యారు. ఈ నేపథ్యంలో, సముద్రంలోకి దిగి భక్తులు స్నానమాచరించకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

'సర్'కు మద్దతిచ్చేవారంతా ప్రజాస్వామ్య వ్యతిరేకులు

● మంత్రి అన్బిల్ మహేష్


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అన్బిల్ మహేష్

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు మద్దతిచ్చేవారు ప్రజాస్వామ్య వ్యతిరేకులని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ వ్యాఖ్యానించారు. తిరుచ్చి దక్షిణ జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ బూత్ ఏజెంట్ల కోసం గురువారం శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే కూటమి ప్రజాస్వామ్యాన్ని గట్టిగా నమ్ముతున్నందువల్లే సర్ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని కోరుకుంటున్నామని, దీనిని వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదన్నారు. కొత్త పాఠ్యాంశాన్ని రూపొందించేందుకు విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన 13 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కరూర్ తొక్కిసలాట దుర్ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ జరుపుతోందని, ఇందులో ప్రభుత్వం జోక్యం చేసుకోదన్నారు. రాష్ట్రంలో 13 కొత్త పాఠశాలల ప్రారంభానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, ఈ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుండి అడ్మిషన్లను ప్రారంభించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ పాఠశాలు, ఎయిడెడ్ పాఠశాలల ముఖద్వారంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు త్వరలోనే టెండర్లకు ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు.

త్రివేణి సంగమం వద్ద మహాసముద్ర తీర్థ హారతి



పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐప్పసి మాస పౌర్ణమి సందర్భంగా కన్నియాకుమారి సముద్ర హారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో కన్నియాకుమారి త్రివేణి సంగమంలో మహాసముద్ర తీర్థ హారతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మేళతాళాలు, దేవార పాటలతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కన్నియాకుమారి సన్నిధి వీధిలోని వేదపాఠశాల నుంచి మేళతాళాలతో పుష్పాలతో అలంకరించిన వాహనంలో నటరాజ స్వామిని ఎరశురామ వినాయక ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ముత్తయిదువులు దీపాలు వెలిగించి సముద్రానికి హారతులిచ్చారు. పౌర్ణమి ఘడియలు ముగుస్తున్న సమయంలో, త్రివేణి సంగమంలో మహాసముద్ర తీర్థ హారతులు అందజేశారు. ఐదుగురు శివాచార్యులు, అర్చకులు ఐదు అడుగుల దీపాలు వెలిగించి తూర్పు దిశలో చంద్రుని వైపు హారతి పూజలు చేశారు.

పాండ్యరాజుల కాలంనాటి శిలాశాసనం లభ్యం


తవ్వకాల్లో లభ్యమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నిపుణులు

ప్యారీస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపంలో పాండ్యరాజుల కాలంనాటి సుమారు 800యేళ్ల పురాతన శిలాఫలకం తవ్వకాల్లో బయల్పడినట్లు మనోన్మనియం సుందరనార్ విశ్వవిద్యాలయ పురావస్తు విభాగాధిపతి ప్రొఫెసర్ సుధాకర్ తెలిపారు. తిరునల్వేలికి పశ్చిమ దిశగా సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లవూర్ గ్రామంలో తామ్రభరణి నదీ తీరంలో పురాతన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయం, శివాలయం, ధర్మశాస్త ఆలయాలున్నాయి. వీటి సమీపంలో ఈ యూనివర్సిటీ విద్యార్థులు ప్రొఫెసర్ సుధాకర్ నేతృత్వంలో నిర్వహించిన తవ్వకాల్లో సుమారు 30కి పైగా శిలాఫలకాలు లభ్యమయ్యాయి. వెంటనే వాటిలోని సారాంశాన్ని నిపుణులు పరిశీలించారు. వాటిలో సుమారు 800యేళ్ల క్రితం ఈ భూ భాగాన్ని పాలించిన సుందరపాండియన్, 700యేళ్ల క్రితం పాలించిన కుళశేఖరపాండియన్, 600యేళ్ల క్రితం పాలించిన ఉత్తమపాండియన్ రాజుల పేర్లు, వారు నిర్మించిన ఆలయాలు, వ్యవసాయ, తాగునీటి పథకాలు తదితర వివరాలు గుర్తించారు. అంతేకాకుండా మలుయూర్, తిరునల్వేలి లాంటి గ్రామాల పేర్లు కూడా ఈ శిలాఫలాకాల్లో ఉండడం గుర్తించారు. పాండ్యరాజులు బ్రాహ్మణులకు భూములు అధికంగా దానం చేసిన సమాచారం, ఆంగ్లేయుల పాలకుల్లో ఒకరైన 'లార్డ్ దురై' అనే పేరుతో శిలాఫలకం కూడా ఉండటం గమనార్హం. తామ్రభరణి నదీ పరివాహక ప్రాంతాల్లో సుమారు 200యేళ్ల క్రితం ఆంగ్లేయుల పాలనలో లార్డ్‌దురై చెక్ డ్యాంను నిర్మించినట్లు ప్రొఫెసర్ సుధాకర్ తెలిపారు.

కత్తిపార ఫ్లై ఓవర్‌పై 101 అడుగుల ఎత్తులో మెట్రోరైలు మార్గం


పనులు జరుగుతున్న దృశ్యం

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి కత్తిపార ఫ్లై ఓవర్‌పై 101 ఎత్తులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మెట్రో రైలుమార్గం పనులు జరుగుతున్నాయి. నగరంలో చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో ప్రాజెక్ట్‌లో మూడు మార్గాల్లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. అందులో, మాధవరం-షోలింగనల్లూర్ మధ్య 47 కి.మీ 46 రైల్వేస్టేషన్లతో ఏర్పాటుకానున్న మెట్రోరైలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మార్గంలో ఫ్లై ఓవర్ కోసం 320 స్తంభాలు నిర్మించారు. స్తంభాల నిర్మాణం పూర్తయిన ప్రాంతాల్లో, ఫ్లై ఓవర్ అనుసంధాన పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో, గిండి కత్తిపార నుంచి 1,354 అడుగుల వరకు భారీ రైలు మార్గం పనులు 101 అడుగుల ఎత్తులో జరుగుతున్నాయి. 2027నాటికి పనులు పూర్తిచేసి ఈ మార్గంలో మెట్రోరైలు సేవలు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.


దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లోని మదర్‌థెరిస్సా మహిళా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పట్టాలు స్వీకరించిన విద్యార్థినులతో ఛాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి, అధ్యాపకులు.

జలకంఠేశ్వరుడికి అన్నాభిషేకం



వేలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళ ఐప్పసి పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో అన్నాభిషేకాలు నిర్వహించారు. ఈ క్రమంలో వేలూరు కోట ప్రాంగణంలోని కోట జలకంఠేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 7 గంటలకు వేదమంత్రోచ్ఛారణ, మేళతాళాల నడుమ అర్చకులు స్వామివారికి అన్నాభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పల్లికరనైలో 'యురేషియా కోయిల'


పల్లికరనై ప్రాంతంలో యురేషియా కోకిల

పెరంబూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లికరనై చిత్తడి నేల ప్రాంతానికి ఐదేళ్ల అనంతరం 'యురేషియా కోయిల' వచ్చినట్లు పక్షుల ప్రేమికులు నిర్వహించిన సర్వేలో తెలిసింది. ప్రస్తుతం పల్లికరనై చిత్తడి నేల ప్రాంతానికి 202 రకాలకు చెందిన పక్షులు వచ్చినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, యురేషియ కోయిలలు ప్రస్తుతం రాష్ట్రానికి రావడం ప్రారంభించాయి. అడయార్ ముఖద్వారం, పట్టణంబాక్కం ప్రాంతాల్లో వీటి సంచారం అధికంగా ఉంది. ఇంతకు ముందు, 2020లో పల్లికరనై చిత్తడి నేల ప్రాంతాలకు యురేషియా కోయిలలు వచ్చాయి. ఈ విషయమై 'ది నేచుర్ ట్రస్ట్' నిర్వాహకులు తిరునారనన్ మాట్లాడుతూ... ఐరోపా, ఆసియాలోని మంగోలియా, మియన్మార్ దేశాల్లో ఈ కోయిలలు అధికంగా కనిపిస్తుంటాయన్నారు. శీతాకాలంలో ఆహారం, పునరుత్పత్తి కోసం ఆఫ్రికా దేశాలు, ఇండియాకు ఇవి వలస వస్తుటాయన్నారు. ఈ పక్షులు పల్లికరనై రావడంతో, ఈ ప్రాంతం యొక్క పర్యావరణ పరిస్థితి బాగుందని స్పష్టమవుతోందని ఆయన తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మాజీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఉన్నారు.


రుయాలో డాక్టర్ల ఘర్షణ

డాక్టర్‌పై చేయి చేసుకున్న మరో వైద్యుడు

విచారణ చేపట్టిన అధికారులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై ప్రైవేటు వైద్య కళాశాలకు చెందిన మరో వైద్యులు దాడికి పాల్పడిన ఘటన గురువారం రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో పీజీ డాక్టర్లకు పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం పరీక్షలు ముగిశాయి. అపోలో వైద్యశాలకు చెందిన పీజీ వైద్యులు పరీక్ష ఎలా రాశారు అనే విషయం తెలుసుకునేందుకు ఆ కళాశాల తరపున ఎగ్జామినర్‌గా వచ్చిన డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పరీక్షల విధుల్లో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసులు దగ్గరకు వచ్చారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గురువారం మళ్లీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి రుయాస్పత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ శ్రీనివాసులు వద్దకు వచ్చారు. గంటల తరబడి శ్రీనివాసులరెడ్డిని విభాగం ముందే నిరీక్షింపజేశారు. సహనం కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి డాక్టర్ శ్రీనివాసులు గదిలోకి వెళ్లి ఆయనపై చేయి చేసుకున్నారు. దీంతో ఇరువురు దాడులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఇతర వైద్యులు గుర్తించి సర్దిచెప్పారు. ఈ విషయంపై ఇరువురు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభ, రుయా సూపరింటెండెంట్ రాధలకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వారు విచారణ చేపట్టారు. దాడి జరిగిన మాట వాస్తవమేనని, కారణాలపై విచారణ చేపడుతున్నామని, పూర్తి వివరాలు తెలుసుకున్నాక తగు చర్యలు చేపడతామని ప్రిన్సిపల్ రవిప్రభ తెలిపారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,239

తలనీలాలు సమర్పించినవారు: 23,436



మహిళలకు వరం పింక్ బస్సు

స్విమ్స్‌లోని పింక్ బస్సు ద్వారా 2018 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో నోటి క్యాన్సర్‌ను గుర్తించేందు పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు రొమ్ము పరీక్ష, మామో గ్రామ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పెట్ సిటీ, లీనియర్ ఎక్సలేటర్ మొదలగు పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తించేందుకు పాప్ స్మియర్ పరీక్ష కూడా పింక్ బస్సులో అందుబాటులో ఉంది.

పింక్ బస్సు సేవలు

- నిర్వహించిన మొత్తం క్యాంపులు : 692
- స్క్రీనింగ్ చేసిన రోగుల సంఖ్య : 41,783
- చికిత్స తీసుకున్న వారి సంఖ్య : 744(ఆపరేషన్లతో కలిపి)
- 2025లో (జనవరి నుంచి అక్టోబరువరకు) ఓపీల సంఖ్య :21037, ఐపీ :5917



త్వరలో ప్రారంభం కానున్న శ్రీబయో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం :

క్యాన్సర్ భూతం కాదు జబ్బు మాత్రమే

తిరుపతి

ఆంధ్రజ్యోతి

క్యాన్సర్ అనే పేరు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఆందోళన, భయం మొదలవుతుంది. క్యాన్సర్ అని నిర్ధారణ అయిన వారితో పాటూ వారి కుటుంబ సభ్యుల్లోనూ, ఆత్మీయుల్లోనూ నిరాశ పేరుకుంటుంది. ఒక అసక్తత అసహనంగా మారుతుంది. అయితే క్యాన్సర్ అన్నది ఇప్పుడు మరణానికి సంకేతపదం కానేకాదు. వైద్యరంగంలో జరిగిన ఆవిష్కరణలు, కనుగొన్న మందులు, అనుసరిస్తున్న వైద్య విధానాలు.. కేన్సర్‌ను నిరోధించడమే కాదు, నియంత్రించగలుగుతున్నాయి. కేన్సర్ అని నిర్ధారణ అయినవారిలో పోరాడి గెలవాలనే పట్టుదల, వారికి స్థైర్యాన్నిచ్చే కుటుంబ సభ్యులు ఉంటే అద్భుతాలు కూడా జరుగుతాయి. క్యాన్సర్ ఎందుకు వస్తుందో కారణాలు అనేకం ఉండచ్చు కానీ మొదట్లోనే గుర్తించి వైద్యం మొదలు పెడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఇలా చికిత్సతో క్యాన్సర్‌ను జయించిన వారు ఎందరో ఉన్నారు. చివరి స్టేజ్‌లో ఆస్పత్రిమెట్లెక్కి కరెంటు, కీమో థెరపీలతో పోరాడి గెలిచినవారూ ఉన్నారు. కాబట్టి క్యాన్సర్ అన్నది గతంలోలా ఇప్పుడు కబళించే భూతం కాదు. అది కూడా వైద్యంతో నియంత్రించగల ఒక జబ్బు మాత్రమే అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, స్వీకార్ డైరెక్టర్ ప్రశాంత్ చెబుతున్నారు. తిరుపతిలో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు తగిన వైద్యం అందుబాటులో ఉందంటూ ఆ వివరాలు తెలియజేశారు.

తిరుపతిలో స్విమ్స్‌తో పాటు టాటా కాన్సర్ (స్వీకార్) ఆస్పత్రులలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స లభిస్తున్నాయి. స్విమ్స్, స్వీకార్ వంటి వైద్య సంస్థలు 'క్యాన్సర్‌ను జయిద్దాం'..అంటూ సామాజిక ప్రచారాలు, వాక్‌థాన్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. డోర్ టూ డోర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ముందస్తు గుర్తింపు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో క్యాన్సర్ అని అనుమానం వస్తే నిర్ధారణ కోసం వైద్యనిపుణులు పరీక్షలను సూచిస్తున్నారు. బ్రెస్ట్ కాన్సర్‌పై జాగ్రత్తలు, మహిళలకు స్వీయ పరీక్ష గురించి అవగాహన కలిగిస్తున్నారు. సర్జికల్ చికిత్సతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నగదు ఖర్చు లేకుండా అందుతున్నాయి. ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో సర్జికల్, రేడియేషన్ చికిత్స లేనప్పటికీ ఓపీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.



స్విమ్స్ క్యాన్సర్ విభాగంలో త్వరలో అందుబాటులోకి రానున్న లీనియర్ యాక్సిలేటర్

టీటీడీ సాయంతో త్వరలో 'శ్రీబయో'

క్యాన్సర్ నివారణకు ప్రభుత్వంతో పాటు టీటీడీ సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రస్తుతం స్విమ్స్ క్యాన్సర్ విభాగం కోసం రూ118 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో 391 పడకలతో పూర్తి స్థాయిలో శ్రీ బాలాజి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (శ్రీబయో)ని జనవరిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యాన్సర్ విభాగానికి టీటీడీ రూ184 కోట్ల నిధులు కేటాయించింది. ఈ విభాగంలో లీనియర్ యాక్సలేటర్‌కు రూ24కోట్లు వెచ్చిస్తున్నారు. పెట్, గామా స్కాన్ : రూ23కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంకా సీఎస్ఎస్‌డీ : రూ14కోట్లు, ఎంఆర్ఐకి రూ8కోట్లు వ్యయం చేస్తున్నారు.

ఏడాదికి 3వేలు పైనే

గత మూడేళ్ల గణాంకాల ప్రకారం ప్రతిఏటా సుమారు 3వేల నుంచి 3500 కొత్త క్యాన్సర్ కేసులు గుర్తిస్తున్నారు. తిరుపతి జిల్లాలో నోటి(ఓరల్), బ్రెస్ట్ (స్తన), సర్వికల్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయంలో క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

స్విమ్స్‌లో ఇవి ఉన్నాయి

క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం స్విమ్స్‌లో ఓ ఎంఆర్ఐ, సిటి, పెట్ స్కాన్‌తో పాటు తాజాగా గామా కెమెరా, లినాక్ వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్బీ)) అనుమతులు ప్రక్రియ కొనసాగుతోంది. అనుమతులు లభించిన వెంటనే ఈ యంత్రాలను జనవరి నుంచి అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రణాళికలు రూపొందించారు.

పాలియేటివ్ కేర్:

చికిత్సకు లొంగకుండా చివరి దశలో ఉన్న రోగులకు పాలియేటివ్ కేర్ చాలా ముఖ్యం. స్విమ్స్‌లో క్యాన్సర్ పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ (ఉపశమన చికిత్స) విభాగం ఉంది. ఇప్పటి వరకు ఈ విభాగం ద్వారా దాదాపు 610 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వివిధ ఉపశమన చికిత్సలు అందించారు. భవిష్యత్తులో దీనిని మరింతగా విస్తరించబోతున్నారు.

స్వీకార్‌లో ఇలా..

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్(స్వీకార్), టాటా ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు స్తన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కోసం ఉచిత స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 60వేల మందికి పైగా వ్యక్తులు ఈ స్క్రీనింగ్ సేవలను పొందారు.

- ఓపీడీ : 152657
- కీమోథెరపీ : 32405
- రేడియేథెరపీ : 49608
- బ్రాకీ థెరపీ : 996
- సర్జరీలు : 3537

జిల్లాలో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు: స్తన (బ్రెస్ట్), గర్భాశయ ముఖద్వార, నోటి, ఊపిరితిత్తులు, కడుపు, పెద్దపేగు క్యాన్సర్లు.

ఇవి అవసరం

క్యాన్సర్ చికిత్సలో జరుగుతున్న పరిశోధనల ఫలితంగా అనేకరకాల ఆధునిక సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతికి పీడియాట్రిక్ ఆంకాలజీ (శిశు క్యాన్సర్ వైద్యం), బీఎంటీ (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్) ఎముకమజ్జ మార్పిడి , రేడియోఆక్టివ్ అయోడిన్ చికిత్స విభాగాలు అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. టీటీడీ ముందుకొచ్చి వీటిని కూడా అందుబాటులోకి తీసుకొస్తే క్యాన్సర్ బాధితులకు వరప్రసాదినిగా మిగిలిపోతుంది.

ఆస్తి నష్టం రూ.30 కోట్లు!

- 2 వేల ఎకరాల్లో ఇసుక మేట
- ముంపునకు గురైన 700 కుటుంబాలు
- ప్రభుత్వానికి తాత్కాలిక నివేదిక
- కట్ట నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పాతపాళెం వద్ద ఓళ్లూరు చెరువు కట్ట గురువారం తెగడంతో సుమారు రూ.30 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. కళత్తూరు హరిజనవాడలో 700 కుటుంబాలు ముంపునకు గురికాగా, ఎస్ఎల్‌పురంలో 40, పాతపాళెంలో 300 కుటుంబాలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. కళత్తూరు దళితవాడలో సుమారు 200మూగజీవాలు కొట్టుకుపోయినట్లు అంచనా. ఓ కుటుంబానికి రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. రాయలచెరువు కట్ట శాశ్వత నిర్మాణానికి రూ.6కోట్లకు పైగా అవసరం. కేటీ రోడ్డు నుంచిదిగువపురం వద్ద కల్వర్టు, రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.20లక్షలు.. శాశ్వత మర్మతులకు అయితే రూ.3కోట్లు అవసరం కానుంది. 170 కరెంటు స్తంభాల కూలిపోయాయి. చెరువు దిగువ భాగాన రెండు వేల ఎకరాల్లో ఇసుక మేట వేయగా, కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. 60 ఎకరాల్లో వేరుశనగ కొట్టుకుపోయింది. దాదాపు వెయ్యి కుటుంబాలు బాధితులుగా నిలిచారు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గురువారం రాత్రి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇక 200మంది పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన కళత్తూరు గ్రామంలో పారిశుధ్య పనులుచేపట్టారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవిఅ క్కడే బస చేసి బాధితులకు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు చర్యలుచేపడుతున్నారు. చనిపోయిన ఆవు, గేదెకు, రూ.50వేలు, మేకకు రూ.7,500 వంతున నష్టపరిహారం అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వైద్య సేవలతో పాటురిలీఫ్‌సెంటర్లతో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు హౌసింగ్ పథకం కింద నిర్మిస్తామన్నారు. చెరువు కట్ట తెగడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్







పోలీసు ఆన్ రెస్క్యూ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కళత్తూరు దళితవాడలో సహాయక చర్యలకోసం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సీఐలు, ఎస్ఐలు, కేవీబీపురం, సత్యవేడు, పిచ్చాటూరు, పోలీసు స్టేషన్ల సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఘటనాస్థలికి చేరకుని పరిస్థితిని పరిశీలించారు. ఎప్పటి కప్పుడు నీటి మట్టం మార్పులను గమనిస్తూ గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో కలసి సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 500 ఇళ్లు నీట మునిగే పరిస్థితి ఏర్పడినా సమయోచిత చర్యలతో ప్రజలను సురక్షితంగా తరలించగలిగామని ఎస్పీ చెప్పారు. అత్యవసర పరిస్థితిలో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎస్పీ

నీటిపాలైన బతుకు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగడంతో కళత్తూరు దళితవాడ జనం తీవ్రంగా నష్టపోయారు. ఎటు చూసినా ఆవేదనే. 700 కుటుంబాల వరకు ముంపునకు గురయ్యాయి. బాధితుల ఆవేదన వారి మాటల్లోనే..

భారీగా పశు నష్టం



నేను నెల్లూరులో పశువైద్య విద్య అభ్యసిస్తున్నా. పశువుల పెంపకంపై ఆసక్తితో దేశవాళీ రకమైన ఒంగోలు జాతి ఆవులు, ఎద్దులు, పాడిగేదెలను ఇంటి వద్ద మేపుతుంటా. పది ఒంగోలు ఆవులు, నాలుగు ఒంగోలు జాతి పాడిగేదెలు, 16మేకలు నీటిలో కొట్టుకుపోయాయి. ఏం చేయాలో దిక్కు తోచడంలేదు.

- సునీల్

కూడు దొరికే మార్గమేదీ?



గేదెల ద్వారా పాలు అమ్ముకుని ఇద్దరు ఆడబిడ్డలను చదివించుకుంటున్నా. ఆ నాలుగు గేదెలు ఒకేసారి కడతేరిపోయాయి. రేపటి నుంచి మా కుటుంబానికి కూడుదొరికే మార్గంలేదు.

- సుకన్య

మొదటిఇల్లు మాదే



సెల్‌ఫోన్ల ద్వారా చెరువు తెగిన విషయం తెలిసి జనాలు పరుగెత్తారు. నాకు ఫోన్ లేకపోవడంతో ఆలస్యంగా తెలిసింది. మాది రేకుల ఇల్లు కావడంతో బిడ్డలను తీసుకుని ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు. దక్షిణ వైపు నుంచి పొలాల్లో నీటి ప్రవాహం పరుగులుపెడుతున్న దృశ్యం కనిపించింది. ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలను సంకన వేసుకునిఊరిలోకి పరుగులు తీసి ఓ మిద్దెపైకి ఎక్కా. మొదట నీటి ప్రవాహం మా ఇంటినే తాకింది. ఏ వస్తువూ మిగలలేదు.

- సంపూర్ణమ్మ

ఎలా బతకాలి?



నాలుగు ఇనుప రేకులతో చుట్టూ తడికలుగాపెట్టుకుని బతికే నిరుపేద కుటుంబం మాది. నీటి ప్రవాహంలో తట్టా బుట్ట కొట్టుకుపోయాయి. నాలుగు పాత గుడ్డలు తీసుకుని రోడ్డున పడ్డాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

- రఘునమ్మ

50 ఏళ్లక్రితం ఇలాంటి ఘటనే



50ఏళ్ల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. కానీ ఇంత నష్టం లేదు. అప్పుడూ రాయలచెరువు నీళ్లు మా దళితవాడపై పడింది. నీటి ఉద్రుతి తక్కువ కావడంతో కాలువ పొంగి ప్రవహించింది. కానీ ఇంతటి విపత్తు ఎపుడూ ఊహించలేదు.

- మోషయ్య

అందరినీ అప్రమత్తంచేశాం



రాయలచెరువు కట్టకు బొగడ పడిందని పాతపాళెం నుంచి బంధువులు ఫోనుచేసి చెప్పారు. నాతో పాటు కళత్తూరు నుంచి 20మందినితోడుపెట్టుకుని ద్విచక్ర వాహనంలో చెరువు వద్దకెళ్లాం. మా కళ్లముందే నీటి ఉధృతి పెరిగి చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఇళ్లు వదిలి పారిపోవాలంటూ అందరికీ సెల్‌ఫోన్‌తో హెచ్చరికలు చేయడంతో మిద్దెలు ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

- అమాసయ్య

దాచుకున్న సొమ్ము పోయింది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. చిల్లర దుకాణం ఉంది. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టా. దీనికి రూ.3లక్షలు నగదు, కొంత బంగారు నా దుకాణంలో ఉంచుకున్నా. దీంతో పాటు వస్తువులు మొత్తం పోయాయి.

- సౌజన్య

బిడ్డకోసం తల్లడిల్లిపోయాం



నెల రోజుల క్రితం నేను మగబిడ్డకు జన్మనిచ్చా. ఊరిని ఉప్పెన తాకడంతో బిడ్డను కాపాడు కోవడానికి ఇంట్లో వాళ్లమంతా తల్లడిల్లిపోయాం. ప్రవాహం తగ్గడంతో పొరుగున ఉన్న రామగిరికి కట్టుబట్టలతో వెళుతున్నాం.

- సుచిత్ర

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

రెండోరోజూ ఏసీబీ సోదాలు

- పలు అక్రమ రిజిస్ట్రేషన్లు గుర్తింపు ?

రేణిగుంట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన గురువారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. కార్యాలయానికి తాళం వేసి మరీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. తాత్కాలికంగా క్రయ, విక్రయాలను నిలిపివేశారు. తిరుపతి రూరల్ పరిధిలోని 22 ఏ నిషేధిత జాబితాలోని మఠం భూములు, శ్రీనివాసపురం, పద్మావతిపురంలోని ఇళ్ల స్థలాలకు, ఇళ్లకు డీఐజీ, జిల్లా అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి నేరుగా వ్యక్తిగత సహాయకుడు, ఓ డాక్యుమెంట్ రైటర్, అతని తమ్ముడు ద్వారా చట్టంలోని లొసుగుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములకు సదరు భూమి నెంబర్ వేసి రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతర జిల్లాల (ఎనీవేర్) రిజిస్ట్రేషన్ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు తనిఖీలలో గుర్తించిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రొసీడింగ్స్ రూపొందిస్తుండడంతో తనిఖీలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఒ ఏసీబీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులు పంపకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువకుడి దారుణ హత్య

- సంప్‌లో బయటపడిన మృతదేహం

రేణిగుంట నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ యువకుడు హత్యకు గురైన వైనం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని నేతాజీ కాలనీకి ఆనుకొని ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశం వద్దకు గురువారం కొంత మంది యువకులు మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడి ఖాళీ భవనం నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో వారు సమీపంలోని సంపులో పరిశీలించారు. అందులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గాజులమండ్యం పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ సుధాకర్‌లు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఎక్కడో హత్య చేసి రెండు రోజుల క్రితం కాళ్లు చేతులు కట్టేసి మృతదేహాన్ని సంపులో పడేసి ఉంటారని డీఎస్పీ చెప్పారు. మృతదేహం గుర్తించలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. హత్య కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హత్యకు గురైన యువకుడు సమీ ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. అక్రమ సంబంధమా, ఆర్థిక లావాదేవీలా అనే కోణంలో విచారిస్తున్నారు. క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాళ్లు చేతులకు కట్టేసి ఉన్న మృతదేహం

ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్ సస్పెన్షన్

- ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని అధికారుల ప్రాథమిక నిర్ధారణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ సైకాలజీ విభాగ ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి సస్పెండ్ అయ్యారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈనెల ఒకటో తేదీన సైకాలజీ విభాగంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేశారని, ఇది ఆయన నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అది నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నంత కాలం తిరుపతి నుంచి వెలుపలకు వెళ్లకూడదని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధిత అధికారుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సగం వేతనంతో జీవనాధార భత్యం చెల్లిస్తారు.



ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి